తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
జాతీయ దిన ప్రతిక
RNI. TELTEL / 2022 / 83463
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శుక్రవారం
24 జూలై 2026
సంపుటి 03
సంచిక 283
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

### యూనివర్సిటీ పరిధిలో పరీక్షలు వాయిదా

హైదరాబాద్,జులై23 తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 24న శుక్రవారం విద్యాసంస్థల బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ), జేఎన్‌టీయూ, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ) పరిధిలో నిర్వహించే పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు ఆయా వర్సిటీలు ప్రకటించాయి. అనుబంధ కళాశాలల్లో జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నామని.. త్వరలో కొత్త

మిగతా 2వ పేజిలో..



## నేడు దేశవ్యాప్త ఆందోళనలు

- కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు
- శాంతియుతంగా నిరసనలు తెలపాలని సూచన

న్యూఢిల్లీ,జూలై23 నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత వహించాలంటూ ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) 24న శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఇటీవలి

మిగతా 2వ పేజిలో..



## గోదావరి పుష్కరాలకు రూ.50 కోట్లు మంజూరు

- కొత్తగా నేతన్నల సేవలో పథకం అమలు
- చేనేత కుటుంబాలకు ఏటా రూ.25వేల ఆర్థికసాయం
- భీమవరంలో తొలి మహిళా ప్రైవేట్ వర్సిటీ ఏర్పాటు
- మార్క్‌ఫెడ్‌కు రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారంటీ
- భోగాపురం విమానాశ్రయం పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చ
- కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి,జూలై23 గోదావరి పుష్కరాల సమర్థ నిర్వహణకు రూ.50 కోట్లు మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 'నేతన్నల సేవలో' పథకం అమలుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసిందని చెప్పారు. ఈ పథకం కింద చేనేత కుటుంబాలకు ఏటా రూ.25వేల ఆర్థికసాయం అందించనున్నట్లు వివరించారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను మీడియాకు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో మొదటి ప్రైవేటు మహిళా యూనివర్సిటీ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భీమవరంలో విష్ణు ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ పేరిట దీన్ని ఏర్పాటు చేయనున్నారు. శ్రీకాకుళంలో బ్రహ్మకుమారీస్ సంస్థకు మున్సిపల్ స్థలం లీజు కొనసాగింపునకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అగ్నిమాపక సేవల విస్తరణ పనులకు ఆమోదముద్ర వేసింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణానికి

మిగతా 2వ పేజిలో..

## గొడ్డలి పార్టీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వివాదాలు సృష్టించడమే గొడ్డలి పార్టీ నైజం
- క్షేత్రస్థాయిలో కూటమి విజయాలను ప్రజలకు తెలపాలి
- ప్రెస్‌మీట్లు పటెట్ఇ చేతులు దులుపుకుంటే కుదరదు
- అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోవాలి
- కేబినేట్ భేటీలో మంత్రులకు సిఎం చంద్రబాబు క్లాస్



అమరావతి,జూలై23 గొడ్డలి పార్టీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు సూచించారు. క్యాబినెట్ భేటీలో అజెండా అంశాలు ముగిశాక తాజా పరిస్థితులపై ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీని దిల్లీ ఆందోళనలతో ముడిపెట్టడానికి వైకాపా ప్రయత్నిస్తోందని సీఎం దృష్టికి మంత్రులు తీసుకెళ్లారు. వివాదాలు సృష్టించడమే గొడ్డలి పార్టీ నైజమని చంద్రబాబు మండిపడ్డారు. అనంతరం మరికొన్ని అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో ఇన్‌ఛార్జ్ మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారమవుతాయని చంద్రబాబు అన్నారు. మంగళగిరిలో ఇళ్ల పట్టాల పంపిణీకి మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని కొనియాడారు. ప్రతి లబ్ధిదారుడికి స్వయంగా ఇళ్ల పట్టా ఇచ్చారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అన్ని చోట్లా సమన్వయంతో ఈ తరహా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాఖాపరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి మంత్రులే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలపై మంత్రులు ప్రెస్‌మీట్‌లు పెట్టి చేతులు దులుపుకొన్నారని సీఎం

మిగతా 2వ పేజిలో..




## ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

- అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష
- కార్యాచరణతో ముందుకు సాగాలని సూచన

సిద్దిపేట,జూలై23 ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. దీనినుంచి బయటపడేలా కార్యాచరణతో సాగాలని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఐఓసీ కార్యాలయంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్వేచ్ఛగా ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటికి సంబంధించి ప్రధాన సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే జూన్ వరకు వర్షాలు లేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. పశువులకు పశుగ్రాసం ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి కరవు పరిస్థితిలో ఆరుతడి పంటలు వేయాలని అన్నదాతలకు సూచిస్తున్నామని అన్నారు. గ్రౌండ్ వాటర్

మిగతా 2వ పేజిలో..

## మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా

- పేదలకు ఇళ్లు కడితే... ఎందుకంత కడుపుమంట?
- పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే... విష ప్రచారమా?
- రూ. 60 లక్షల విలువైన ఇంటిని ఆరు లక్షలకే
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను దగా చేసింది బిఆర్ఎస్
- ఇండ్ల కేటాయింపులో బడుగు బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు
- బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2వ పేజిలో..



## నేటి తరానికి తగ్గుతున్న ఓపిక

- హనీమూన్ మర్డర్ ఘటనే నిదర్శనం
- సోనమ్ బెయిల్ రద్దు చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,జూలై23 సమాజం అనేక మార్పులకు లోనవుతున్న కారణంగా హనీమూన్ మర్డర్ లాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయని సుప్రీం కోర్టు తాజాగా వ్యాఖ్యానించింది. గతేడాది హనీమూన్ సందర్భంగా భర్తను హత్య చేసిన సోనమ్ రఘువంశీ బెయిల్‌పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు

మిగతా 2వ పేజిలో..

## గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ

- గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది బలి
- పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది
- గ్లోబరీనా తప్పిదాలకు కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి
- ధర్మేంద్ర రాజీనామాను బిఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు
- బిఆర్ఎస్, బిజెపిలు రెండూ ఒక్కటే
- సర్ ప్రక్రియలో ఎస్సీఎస్టీ, ఓట్లు తొలగించే కుట్ర
- అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం
- ఓటు లేకపోతే పథకాలు పోతాయని హెచ్చరిక
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,జులై 23: గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరోపించారు. గురువారం మీడియాతో నిర్వహించి చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని.. ఆ సంస్థ పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యాఖ్యానించారు. వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందన్నారు. గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో

మిగతా 2వ పేజిలో..

## గ్లోబరినాతో మీరెందుకు ఒప్పందం చేసుకున్నారు

- పగలు కాంగ్రెస్, రాత్రి బిజెపితో రేవంత్ సావాసం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

2వ పేజిలో..

# ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

రోజురోజుకూ పడిపోతోందని.. దీనిని పెంచేందుకు ప్రత్యేక యాక్షన్ ఎ÷-లాన్ ద్వారా ముందుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు తవ్వే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రతి వర్షం చుక్కను కాపాడుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ సమావేశంలో సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణ, పశుగ్రాసం, చెరువుల్లో నీటి నిల్వలు, ఇతర అత్యవసర చర్యలపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ వాటర్ పెంపునకు ఇంకుడు గుంతల తవ్వకం, రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్ ఫామ్ సాగు చేపట్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచాలని సమావేశంలో నిర్ణయించారు.

# నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

తేదీని ప్రకటిస్తామని ఓయూ, జేఎన్‌టీయూ, టీయూ తెలిపాయి. ఈ మేరకు అనుబంధ కళాశాలలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించాయి. నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాలు 24న బంద్‌కు పిలుపునిచ్చాయి.

# నేడు దేశవ్యాప్త ఆందోళనలు

జంతర్‌మంతర్-పార్లమెంటు ర్యాలీ సందర్భంగా యువతపై పోలీసుల కర్కశత్వాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసనకు పిలుపునిచ్చినట్టు తెలిపింది. ఈ కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు, ఇతర ఏర్పాట్లకు సిద్ధం కావాలని యువతను కోరింది. శాంతియుతంగానే నిరసనలు ఉండాలని కూడా సూచించింది. పేపర్ లీక్ అంశంపై చర్చకు తాము సిద్ధమని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ మరో నిరసన కార్యక్రమానికి సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిరసన కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు పొందేందుకు, ఏర్పాట్లు చేసేందుకు విద్యార్థి సంఘాలు, యూత్ ఆర్గనైజేషన్లు కలిసి పనిచేయాలని సీజేపీ పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీక్ అంశంలో సీజేపీ డిమాండ్స్ గురించి ఈ నిరసనల్లో బహిరంగంగా చదవాలని పేర్కొంది. బాధితులకు సంఘీభావంగా ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేయాలని కూడా సూచించింది. నిరసనల్లో కేవలం సానుకూల నినాదాలను మాత్రమే చేయాలని చెప్పింది. ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొంది. నిరసనకు అనుమతి ఉన్న ప్రాంతాలకే పరిమితం కావాలని, ట్రాఫిక్‌కు ఆటంకాలు లేకుండా చూసుకోవాలని సూచించింది. రెచ్చగొట్టే చర్యలకు స్పందించవద్దని కూడా పేర్కొంది. ఇక నీట్ ఉదంతంపై విచారణ కోసం కేంద్రం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఇదిలావుంటే సీజేపీ ఆందోళనల నేపథ్యంలో న్యూదిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆందోళనల తీవ్రత అధికంగా ఉన్న కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30కే దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు యజమానులు సహకరించాలని కోరింది. ఎన్‌డీటీఏ ఆదేశాలను ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు మూసేయమనడం, జంతర్‌మంతర్ వద్ద పోలీసులను మోహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్రం మరోసారి బలప్రయోగం చేయాలని చూస్తోందని ఆరోపించారు.

# నేటి తరానికి తగ్గుతున్న ఓపిక

ఈ వ్యాఖ్యలను చేసింది. ఈ కేసులో జస్టిస్ ఎం. ఎం సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలె ధర్మాసనం సోనమ్ బెయిల్‌ను రద్దు చేసింది. ఆమె మూడు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. మారుతున్న సమాజంలో ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయి. నేటి తరానికి ఓపిక తక్కువ. సమస్యలకు తక్షణ పరిష్కారాలు కావాలని వారు కోరుకుంటున్నారు. వ్యక్తిగత చట్టాలకు సంబంధించిన పలు కేసులు భవిష్యత్తులో కోర్టుల ముందుకు వస్తాయని జస్టిస్ సుందరేశ్ అన్నారు. ఇక ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనలర్ తుషార్ మెహతా తన వాదనలు వినిపిస్తూ సమాజిక మాధ్యమాల ద్వారా ప్రస్తుత తరానికి అధిక సమాచారం అందుబాటులో ఉందని అన్నారు. కానీ జ్ఞానం మాత్రం లేదని వ్యాఖ్యానించారు. వాట్సాప్‌లో షేర్ చేస్తున్న సమాచారమే జ్ఞానంగా చెలామణీ అవుతోందని జస్టస్ వరాలె ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'హనీమూన్‌కు వెళ్లే భర్త తన వెంట బాడీగార్డులను కూడా తీసుకెళ్లినట్టు చెప్పే కామెడీ రీల్స్ వస్తున్నాయి. భార్యాభర్తల మధ్య ఒకప్పుడున్న పరస్పర విశ్వాసం క్రమంగా తగ్గిపోతోంది. గతంలో ఇలాంటి సందర్భాల్లో ఉమ్మడి కుటుంబాలు భార్యాభర్తల సమస్యలను మెరుగ్గా పరిష్కరించేవి' అని సొలిసిటర్ జనరల్ మెహతా చెప్పారు.ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ.. 'మీరు ఉమ్మడి కుటుంబంలోని వారైతే అసంతృప్తిని ఎదుర్కోవడం, సర్దుకుపోవడం అలవాటు అవుతుంది. చిన్న కుటుంబాల్లోని వారు ఏదైనా తక్కువైతే మారాం చేస్తారు' అని వ్యాఖ్యానించింది. చిన్న కుటుంబాల కారణంగా జనాల్లో డిప్రెషన్ పెరుగుతోందన్న నివేదికలు కూడా ఉన్నాయని మెహతా చెప్పారు.

# గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ

విరుచుకుపడ్డారు.కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసిరారు. హరీశ్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని... మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. సర్ నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని ఖస్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. సర్ ఉద్దేశం ప్రక్షాళన అని.. కుట్ర పూరితంగా సర్‌ను వాడుతున్నారని ఆరోపించారు. సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే అని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే.. కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అని అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'ఓటుహక్కు లేకపోతే పథకాలు పోతాయి.. ఓటుహక్కు లేకపోతే ఆధార్ పోతుంది. ఓటుహక్కు లేకపోతే గుర్తింపే ఉండదు... ఓటుహక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు.

బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. 'మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎస్ఐఆర్ పూర్తయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే.. జీహెచ్ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా బాగా పనిచేస్తోంది.. చాలా ఆస్తులు స్వాధీనం చేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినందుకే హరీశ్‌రావుకు కొన్నాళ్లు మంత్రి పదవి ఇవ్వకుండా కేసీఆర్ పక్కన పెట్టారు. గత ప్రభుత్వంలో ఇంటర్ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలతో 27 మంది విద్యార్థులు బలయ్యారు. గ్లోబరీనా సంస్థ విషయంలో కేటీఆర్ నిజాయతీ నిరూపించుకోవాలన్నారు. విద్యార్థుల మృతికి కారణమైన ఆయన క్షమాపణ చెప్పాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదని అన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆర్ఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు. జన్వాడ ఫాంహౌస్ భూములపై కేటీఆర్ విచారణ కోరాలి. మేం అధికారంలోకి వచ్చాకే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ఓపెన్ చేశాం. నాడు వాళ్లు మూసిన ధర్నా చౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.

# గొడ్డలి పార్టీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అసంతృప్తి వ్యక్తం చేశారు. విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే విషయంలో వెనుకబడ్డారన్నారు. పలాసలో రోడ్డు ప్రమాద ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ నిందితుల్ని సీసీ టీవీ ఫుటేజ్‌ల ద్వారా పట్టించిన తీరును మంత్రులకు సీఎం వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఈసారి క్లిష్ట పరిస్థితులు రావొచ్చని సీఎం అన్నారు. తాగునీటికి తీవ్ర సమస్య ఎదురు కావొచ్చని చెప్పారు. ఈ పరిస్థితుల్లో కృష్ణా, గుంటూరు డెల్టాలో వరిసాగు చేయకుండా రైతులను మంత్రులు చైతన్యపరచాలన్నారు. వర్షాభావ పరిస్థితులపై రైతులకు అర్థమయ్యేలా వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గోదావరి-బనకచర్ల అనుసంధానానికి కేంద్రం సహకారం ఉంటుందని వివరించారు. త్వరలోనే మదనపల్లెలో ఉద్యాన హబ్‌ను ప్రారంభిస్తున్నామని చంద్రబాబు ప్రకటించారు. ఆగస్ట్ మొదటి వారంలో ఉత్తరాంధ్రలో భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం.. చివరి వారంలో రాయలసీమలో ఉద్యాన హబ్ ప్రారంభం ఉంటుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర ఆశలకు రెక్కలు కల్పించామని.. ఇక ఆ ప్రాంతంలో వెనుకబాటుతనం ఉండరాదన్నారు. రెండో త్రైమాసికంలో అడుగుపెట్టినందున శాఖల వారీగా సమీక్షలు చేసుకోవాలని మంత్రులకు సీఎం సూచించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై దృష్టిసారించాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 3,120 పోస్టుల భర్తీకి సంబంధించి కేబినెట్ ఆమోదం కోసం వచ్చిన ప్రతిపాదనను మరోసారి అధ్యయనం చేయాలని ఆదేశించారు. అవసరమైన ఉద్యోగాలు కోసం మరోసారి అధ్యయనం చేసి ప్రతిపాదనలు పంపాలని కోరారు. మంత్రులు తమ శాఖల పనితీరుపై మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు. చాలా అంశాల్లో మంత్రులు వెనుకబడిపోతున్నారని సీఎం అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించిన తర్వాత, ఆ అంశంపై ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకుని ప్రజలకు వివరించాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఇద్దరూ కలిసి క్షేత్రస్థాయిలో

పర్యటించాలని సూచించారు. రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలిలో ఆమోదం పొందిన ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో సమీక్షించాలని సీఎం ఆదేశించారు. అలాగే ప్లానింగ్ బోర్డు సమావేశాలను తరచూ నిర్వహిస్తూ, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్షలు చేయాలని సూచించారు. 'మీ శాఖల్లో ఉన్న సమస్యలను మీరే పరిష్కరించే విధంగా చొరవ చూపాలి. రెండేళ్ల ప్రభుత్వ విజయాలపై మంత్రులు మీడియా సమావేశాలు నిర్వహించినప్పటికీ, వాటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లలేకపోయారు' అని చెప్పుకొచ్చారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ కేసుల్లో సీసీటీవీ కెమెరాల ఆధారంగా నిందితులు దొరికిపోయారని ముఖ్యమంత్రి చెప్పారు. డీఎస్సీ పరీక్షల అంశంలో ప్రతిపక్షం చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మలేదని, కోర్టులోనూ వారికి అనుకూల ఫలితం రాలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని ఢిల్లీలో జరిగిన నీట్ ఉద్యమంతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇలాంటి అంశాల్లో మంత్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# గ్లోబరినా తో మీరెందుకు ఒప్పందం చేసుకున్నారు

వరంగల్,జూలై 23 గ్లోబరీనా తన బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఇప్పటికే పరువు నష్టం నోటీసులు పంపానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి.. ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించలేదని విమర్శించారు. లోక్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకం మాత్రమే అని విమర్శించారు. 'గ్లోబరీనా నిజంగానే నా బినామీ సంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుంది? మీ ప్రభుత్వమే ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, ఇప్పుడు అది నా బినామీ సంస్థ అని చెప్పడం ఎంతవరకు సమంజసం?' అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో.. రాత్రి బీజేపీతో ఉంటారంటూ దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు ఒక మూట ఇస్తే, బీజేపీకి రెండు మూటలు పంపుతున్నారని ఆరోపించారు. నేను సీఐడీ విచారణకు సిద్ధం.. రేవంత్ రెడ్డి కుటుంబ అవినీతి అంశంలో సిట్, సీఐడీ విచారణకు సిద్ధమా' అంటే మాజీ మంత్రి సవాల్ విసిరారు. మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా సీఎం భయపడుతున్నారన్నారు. ఓ వైపు పాత కేసుల భయం, మరోవైపు అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు చేస్తున్నారన్నారు. గ్లోబరీనా సంస్థపై రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. రుజువు చేయాలని.. లేదంటే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు

## మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా

హైదరాబాద్,జూలై 23 హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవ ప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా మీసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్దిపొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చలేక పోయింది. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో సొంతింటిని సమకూర్చవలసిన బాధ్యతను విస్మరించి, వారిని నగరానికి దూరంగా నెట్టివేసింది. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు దూరంగా 30?40 కిలోమీటర్ల దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రభుత్వం పేదోడు కూడా హైదరాబాద్ నడిబొడ్డులోనే గౌరవంగా జీవించాలనే భావనతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపైనా బీఆర్ఎస్ విషప్రచారం చేస్తోంది.పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా? నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా? ప్రభుత్వ భూములు కొద్దిమంది కోసం మాత్రమేనా? పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంటని అన్నారు. పేదోడిపై తుపాకి పెట్టి రాజకీయాలు చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గం.

# గోదావరి పుష్కరాలకు రూ.50 కోట్లు మంజూరు

ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులకు మంత్రివర్గం అంగీకారం తెలిపిందని పార్థసారథి తెలిపారు.గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సుమారు మూడు గంటలపాటు సమావేశం కొనసాగింది. భోగాపురం విమానాశ్రయం పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. అలాగే రెండో దశలో 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశంపై మరింత అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఈ అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించి, తదుపరి కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. చేనేత కార్మికులకు 'నేతన్న భరోసా' కింద రూ.25 వేలు చొప్పున ఆర్థికసాయం అందించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 50 ఏళ్లలోపు ఉన్న వారికి బీపీఎల్ నేతలకు సంవత్సరానికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. వెదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి ఏపీ కేబినెట్ నుంచి ఆమోదం లభించింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇవ్వడం వంటి అంశాలకు మంత్రివర్గం నుంచి ఆమోదం లభించింది. విష్ణు ఉమెన్స్ యూనివర్సిటీ, చలపతి యూనివర్సిటీలను ప్రైవేట్ యూనివర్సిటీల జాబితాలో చేర్చే ఆర్డినెన్స్‌పై కూడా మంత్రివర్గం చర్చించింది. అలాగే నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతుల మంజూరుపై చర్చ జరిగింది. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల అంచనా వ్యయాన్ని రూ.241.20 కోట్ల నుంచి రూ.312 కోట్లకు పెంచేందుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. కేబినెట్ సమావేశంలో ఎల్‌నినోను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎలినోవా పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని చెప్పారు. తాగునీటి సరఫరా, పశువులకు మేతపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులు, అధికారులకు సూచించారు. మెగా డీఎస్సీ అంశాన్ని ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలతో ముడిపెట్టి వైసీపీ రాజకీయ లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తోందని వ్యాఖ్యానించారు. లేని వివాదాలను సృష్టించే ప్రయత్నాలు జరుగుతాయని, అలాంటి చర్యలపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు.పొగాకు ధరల అంశాన్ని సమావేశంలో మంత్రులు ప్రస్తావించారు. ఈ అంశాన్ని వివాదాస్పదం చేసేందుకు ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని మంత్రులు చెప్పగా.. వాళ్లకు ఎందుకు అవకాశం ఇవ్వాలని సీఎం ప్రశ్నించారు. ప్రభుత్వం పొగాకు రైతుల కోసం తీసుకున్న చర్యలను ప్రజలకు ముందుగానే వివరించాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు ముందే తెలియజేస్తే ప్రతిపక్షానికి అవకాశం ఉండదని, ప్రో-యాక్టివ్‌గా మంత్రులు ముందుకెళ్లాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాలు, పోలవరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఒకే రోజు నిర్వహించే అంశంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సీఎం పేర్కొన్నారు.

THARANGALU DAILY NEWS
శుక్రవారం, 24 జూలై, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## రోడ్డు మరమ్మతులు వెంటనే చేయాలి



**జఫర్గడ్ ప్రతినిధి, జులై 23,(తరంగాలు ):**సాగరం క్రాస్ నుండి కోణాచలం, కూనూర్, వెంకటాపూర్ క్రాస్ వరకు గల రోడ్డు మరమ్మతులను వెంటనే చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. మండలంలోని సాగరం క్రాస్ నుండి వెంకటాపూర్ క్రాస్ వరకు గుంతల మయంగా ఉన్న రోడ్లను సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించడం జరిగింది. మాట్లాడుతూ ఈ రోడ్డు గుండా ప్రయాణికులు వాహనాదారులు, నిత్యం కాజీపేట హనుమకొండ పట్టణాలకు వెళుతూ ఉంటారు. రోడ్లు అద్వానంగా గుంతల మయంగా ఏర్పడడంతో ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బందుల గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు గుండా నిత్యం కాజీపేట కు ప్రజలు ప్రయాణికులు, ప్రయాణం చేస్తుంటారు. రోడ్డు శిథిలా వ్యవస్థలో మారి గుంతలుగా ఉండడం వల్ల ప్రయాణికులు వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పాలకులు మారుతున్న కూడా రోడ్డు పరిస్థితి మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ ఎక్స్ రోడ్ నుండి 18 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మొదటినుంచి చివరి వరకు గుంతల మయంగా , అద్వాన పరిస్థితిలో అడుగుతే అడుగు గుంతల మయంగా మారింది. గుంతలు పడి ప్రమాదంగా మారింది. వర్షాలు ప్రారంభమైతే రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులకు గురవుతారు. ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉంది. పాలకులు మాటలు చెప్పడమే తప్ప రోడ్లు వేయడం లేదని మండిపడ్డారు. ఇదిగో వస్తుంది అదిగో వస్తుందని ఏళ్లు గడుస్తున్న రోడ్లు వేయడం లేదని అన్నారు. రైతులు ప్రయాణికులు వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించి ఆయా గ్రామాలకు సౌకర్యవంతమైన రోడ్డు కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది. లేనిపక్షంలో రెండు గ్రామాల ప్రజలను ఏకం చేసి రోడ్డుపై ధర్నాలు చేయడం జరుగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ బాల బోయిన మల్లయ్య, రాయపురం బిక్షపతి ,ఇల్లందుల రామస్వామి, సాగ యాదగిరి, హనుమాల కనకయ్య,ఓరుగంటి తిరుపతి, ఇల్లందుల కుమారు, కందుల కుమారు, కందుల రమేష్, మందపురి ఐలయ్య ,జక్కుల సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం గొప్పదానం



**జఫర్గడ్ ప్రతినిధి జులై 23, (తరంగాలు):** మండలంలోని తిడుగు గ్రామ సర్పంచ్ గోపు సోమయ్య తండ్రి గోపి మల్లయ్య మరణాంతరం మరో వ్యక్తికి ఈ లోకాన్ని చూసే మహత్తర అవకాశాన్ని కల్పించారు. గోపు మల్లయ్య నేత్రాలను కరాటే శంకర్రావు ఆధ్వర్యంలో ఎల్వి ప్రసాద్ వైద్య టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ సేకరించారు. ఈ సందర్భంగా సోమయ్య కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులను అభినందించారు. నేత్రదాత కుటుంబానికి అభినందనలు తెలిపి ప్రశంస పత్రం అందజేయడం జరిగింది.

## మానసిక వికలాంగులకు మానవత్వంతో సహాయం



**హైదరాబాద్ జులై 23 ( తరంగాలు )**

కింగ్ డామ్ ఆఫ్ క్రెస్ట్ మినిస్ట్రీస్ ఎన్జిఓస్ ఆధ్వర్యంలో గురువారం బాన్సీలాల్ పేట్ డిస్బాయిల్ ఆశ్రమము లో 450 మంది కి దుస్తులు వంట నూనే మిల్క్ పౌడర్ కొరకు 20000 క్యాష్ అందజేసి,ఈ ఆశ్రమము 90 సంవత్సరాలు గా నిర్వహిస్తున్నారని,ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బిషప్ క్రీస్తురాజు మాట్లాడుతూ కేసీఎమ్ ఎన్జిఓస్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చెయ్యడం సంతోషంగా ఉంది అన్నారు. ఆశ్రమము నిర్వాహకులు చేస్తున పరిచర్య నీ కొనియాడారు.సొసైటీ ఆధ్వర్యం ఇంకా అనేక కార్యక్రమాలు చేస్తామని సహకరిస్తున సొసైటీ సభ్యులు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి శకుంతల,ఫాథర్. ధనరాజ్ , ఫాథర్ పీటర్, పాస్టర్ ఆంథోనీ, ఎస్తేర్ రాణి, ప్రిస్కిల,కుమార్, డేవిడ్ ప్రభాకర్,భాస్కర్, నాగమణి, రిబాక , అంజనీ, శ్రీ లక్ష్మీ, సుధీరవర్మ ,ప్రకాశ్ వర్మ, అశోక్, సామ్యూల్, లావణ్య లక్ష్మీ, జీవన, కామేశ్వరి, స్వర్ణ, శంకర్, సబిత, రాజ్య లక్ష్మీ, సొసైటీ సభ్యులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేశారు.

# మలిదశ ఉద్యమకారుల మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





- ఉద్యమకారుల జిల్లా ప్రధాన కార్యదర్శి- రామ సహాయం ఉపేందర్ రెడ్డి
- మండల కన్వీనర్ గా వల్లెపు శ్రీనివాస్

**నర్సంపేట ప్రతినిధి, జులై :23( తరంగాలు)**

నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండల కేంద్రంలో తెలంగాణ మలిదశ ఉద్యమ కారులందరూ ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో సమావేశం ఏర్పాటు చేయగా సమావేశానికి వరంగల్ జిల్లా ఉద్యమకారుల కమిటీ ప్రధాన కార్యదర్శి రామ సహాయం ఉపేందర్ రెడ్డి హాజరై ఉద్యమకారుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల కన్వీనర్ గా వల్లెపు శ్రీనివాస్,కో కన్వీనర్ లుగా వల్లె రవి, కర్రె దేవేందర్, తాళ్లపల్లి కమలాకర్ గౌడ్, వల్లెపు కుమార్, మేడి సమ్మయ్య, ఆబోతు ఐలయ్య, జాటోతు పూల్య నాయక్, జాటోత్ బాలు నాయక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం కన్వీనర్ శ్రీనివాస్, కో కన్వీనర్ లు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో లో 6 గ్యారంటీలలో ఇచ్చిన హామీలలో భాగంగా ఉద్యమకారులకు అనేక రకాల పథకాలు, పెన్షన్లు, ఇంటి నివాస స్థలం 250 గజాలు, మరికొన్ని హామీలు ఇవ్వడం జరిగిందని కావున ఉద్యమకారులకు తప్పనిసరిగా హామీ ఇచ్చిన పథకాలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు కుంచారపు వెంకట్ రెడ్డి, ఎస్.కె మస్తాన్, చెన్నూరి లక్ష్మీనారాయణ, వీరమల్ల శశిధర్, లకావత్ ప్రవీణ్, ఎస్.కె నాగుల్ మీరా, కుందనపల్లి వీరన్న, ఏపూరి వెంకన్న, కోరే రాములు వేల్పుల లింగన్న, పైండ్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరంలోసీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- లబ్ధిదారులకు అండగా ప్రజా ప్రభుత్వం
- మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** నిరు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆపద సమయంలో కొండంత అండగా నిలిచే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఖమ్మం నగరం 3 టౌన్ ఏరియా లో జరిగింది. రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు ఖమ్మం నగరంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది.పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం 17వ డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలవకట్ట వద్ద లబ్ధిదారి ఇంటిదగ్గర ప్రారంభ మైనది. కార్యక్రమం 27,28, 29, 32, 31,33,35,46,47 డివిజన్ ల లో పంపిణి జరిగింది. మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర గర్ల హనుమంతరావు , జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎం డి.ఖాదర్ బాబా ,డిసిసి ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఖమ్మం నగర పాలకు సంస్థ మాజీ మేయర్ పునుకొల్లు నీరజ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,ఖమ్మం 3 టౌన్ ఏరియా పార్టీ కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ సర్ ఖమ్మం నియోజకవర్గ ఇన్చార్జి కమర్త మురళి, తదితరులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేశారు.అనారోగ్యం,ప్రమాదాల బారిన పడి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు సత్వర సాయం అందించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వారు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే సర్కార్ లక్ష్యమని నేతలు తెలిపారు.?బాధిత కుటుంబాలు ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలోనూ, మౌలిక వసతుల కల్పనలోనూ జిల్లాను ముందంజలో ఉంచేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ?మాజీ కార్పొరేటర్లు గజ్జల లక్ష్మీ వెంకన్న,, ఉపేందర్ స్వామి, కన్నం వైష్ణవి ప్రసన్న ,డి.రవి సరస్వతి.. డిసిసి ఖమ్మం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు,దేవర వెంకన్న ఓబిసి సేల్ నగర అధ్యక్షులు బాణాల లక్ష్మణ్ 17వ డివిజన్

ధనాల వెంకటరమణ, షేక్ జాకీర్, వనవాసం రవీందర్ రెడ్డి, చేగోని నాగరాజు, చావ భుజంగరావు బొమ్మ ఉదయ్ 27వ డివిజన్

మాజీ కార్పొరేటర్ నీలం కృష్ణ, డివిజన్ అధ్యక్షులు యాసబోయిన శ్రీశైలం 28 వ డివిజన్ ,డిసిసి ఖమ్మం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సముద్రాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కలిమెల భద్రయ్య, కలిమెల శ్రీనివాసరావు, అందె సైదనరావు 29 వ డివిజన్

డిసిసి ఖమ్మం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు గుడ్ల శ్రీనివాసరావు 31 వ డివిజన్ డివిజన్ అధ్యక్షులు వల్లెపు ఉపేందర్32 డివిజన్ జిల్లా కార్యదర్శి దేవత శంకర్ నాయక్, దేవత దివ్య, నగర కార్యదర్శి తోల్ల కుటుంబరావు, కూచిపూడి ముద్దుకృష్ణ 33 వ డివిజన్ సాదే శంకర్, పిడుగు ఉపేందర్, పిడుగు మల్లికార్జున్ 35 వ డివిజన్ వెన్న పండు 47 వ డివిజన్ డివిజన్ అధ్యక్షులు షేక్ జానిమియా, డిసిసి ఖమ్మం కార్పొరేషన్ కార్యవర్గ సభ్యులు షేక్ జాకీర్, రేగు లింగస్వామి,నిమ్మల సురేష్ 46డివిజన్ అధ్యక్షులు రజ్జి, రవిశంకర్ దయ్యాల నాగేశ్వరావు బాల్దే నాగేశ్వరరావు, కన్నం రమేష్, గోనెల రవిశంకర్,ఎమ్మె రామకృష్ణ, చల్లా రమేష్, మన్నె హరికృష్ణ, చల్లా సైదులు, మీర్జా అజీజుల్లా బేగ్, సెల్వం జ్ఞానేశ్వర్, వట్టికూటి వీర ప్రసాద్, సింగరాజు వెంకన్న, షేక్ మొయిన్, గోనెల సునీత, జిల్లేపల్లి సులోచన ,విజయలక్ష్మి,మల్యాల బిక్షపతి, నక్క నాగేశ్వరరావు 36 డివిజన్ అధ్యక్షులు గూడెపు నాగరాజు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు

## గోపు సమ్మయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**జఫర్గడ్ ప్రతినిధి, జులై 23,(తరంగాలు):** మండలం తిడుగు గ్రామ సర్పంచ్ గోపు సోమయ్య తండ్రి గోపు మల్లయ్య మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. అయన పార్థివా దేహానికి పూల మాలలు వేసి నివాళులువేసి నివాళులు అర్పించారు. గోపు మల్లయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిజేసిన ఎమ్మెల్యే అయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట వివిధ గ్రామాల సర్పంచులు, కుల్ల మోహన్ రావు తాటికాయల మమత చైతన్, మాజీ మార్కెట్ చైర్మన్ అన్నెబోయిన బిక్షపతి ,మండల స్థానిక నాయకులు,హరి ప్రసాద్ భాస్కర్, నవీన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
శుక్రవారం, 24 జూలై, 2026


# కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం: ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్

- అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ధర్నా.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి: ఎమ్మెల్యే డా మురళీ నాయక్



కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై. 23, తరంగాలు:నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ కేసముద్రం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డా.భూక్యా మురళీ నాయక్, పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్తోతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇలాంటి ఘటనలు దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర అనుమానాలకు దారితీస్తున్నాయని పేర్కొన్నారు.పేపర్ లీకు బాధ్యులైన వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను అణచివేయడం కాకుండా వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు, జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, ఆర్టిఏ నెంబర్ రావుల మురళి,నీలం దుర్గేష్, బండారి వెంకన్న,కదిరే సురేందర్, చీరాల వసంతరావు,పోలేపాక నాగరాజు, బనిశెట్టి వెంకటేశ్వర్లు,కత్తెరశాల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభ్యసనంలో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: ఎంఈఓ కాలేరు యాదగిరి

- కేసముద్రంలో ఘనంగా ప్రారంభమైన 'ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్'



**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జూలై. 23,తరంగాలు:**అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థు లపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కేసముద్రం మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి అన్నారు. ఎఫ్ఎల్ఎన్ ఎన్రిచ్ మెంట్ కార్యక్రమం లో భాగంగా గురువారం కేసముద్రం విలేజ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటుచేసిన మూడు రోజుల ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం ను మండల విద్యాధికారి కాలేరు యాదగిరి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంఈఓ కాలేరు యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులలో అభ్యసన లోపాలను గుర్తించి అభ్యసనంలో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారిలో ఎఫ్ ఎల్ ఎన్ నైపుణ్యాలను మెరుగు పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఉన్న ఉపాధ్యాయులకు తెలుగు, ఆంగ్లము సబ్జెక్టులలో రెమిడీయల్ టీచింగ్ పై ఆర్పీలు వట్నాల సత్య నారాయణ, వై .అశోక్, ఈ.భాస్కర్, కె.సురేష్, వి. భాస్కరరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కల్వల, కేసముద్రం విలేజ్, ఉప్పరపల్లి పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు బండారు నరేందర్, రాజశేఖర్, చంద్రశేఖర్, వివిధ పాఠశాలల ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, చెక్కులు పంపిణీ



- 44 మంది లబ్ధిదారులకు రూ.44.05 లక్షల చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్

**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జులై.23, తరంగాలు:**
కేసముద్రం మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 44 మంది లబ్ధిదారులకు రూ.44,05,104 విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.మహబూబాబాద్ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తున్నామని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి నెల రెండు పర్యాయాలు సీఎం సహాయనిధి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని లేదా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి మధ్యవర్తులు, దళారులను నమ్మవద్దని, అన్ని పథకాలు ఉచితంగానే అమలు అవుతున్నాయని స్పష్టం చేశారు.ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి.ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. పెసర, మినుము, కంది, జొన్న, బొబ్బెర, వేరుశనగ, కూరగాయలు వంటి పంటలను సాగు చేయాలని కోరారు.ఈ సందర్భంగా సబ్సిడీపై అందించిన పెసర, మినుము, కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ బానోతు సునీత, జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు నీలం దుర్గేష్, మాజీ జడ్పీటీసీ బండారి వెంకన్న, ఆర్టీసీ నెంబర్ రావుల మురళీ, సీనియర్ నాయకులు దాస్రూ నాయక్, మాజీ ఎంపీపీ సురేందర్, డైరెక్టర్లు చిదురాల వసంతరావు, ఎండీ అయ్యూబ్ ఖాన్, చింతకుంట్ల యాదగిరి, కౌన్సిలర్లు వల్లందాసు ఉమా రవి, విజయ బద్య, ఎంపీడీవో క్రాంతి, డిప్యూటీ తహశీల్దార్ ఎర్రయ్య, వ్యవసాయ అధికారి వెంకన్న, మండల నాయకులు, సర్పంచులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసముద్రంలో ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే

- అర్హులందరికీ ఓటు హక్కు లభించేలా చూద్దాం: ఎమ్మెల్యే




**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై. 23, తరంగాలు:** గురువారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇంటింటికీ తిరుగుతూ సర్వే బృందాల పనితీరును పరిశీలించిన ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడి ఓటరు వివరాల నమోదు తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించబడేలా ప్రత్యేక శ్రద్ధతో సవరణ ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను నిబంధనలకు అనుగుణంగా కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఓటరు సవరణ ప్రక్రియలో భాగస్వాములై అవసరమైన పత్రాలు సమర్పించి సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. పారదర్శకంగా, సమర్థవంతంగా ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బానోతు సునీత, మహబూబాబాద్ జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ బండారి వెంకన్న, ఆర్టిఏ నెంబర్ రావుల మురళి, సీనియర్ నాయకుడు దాస్రూ నాయక్, మాజీ ఎంపీపీ సురేందర్, కేసముద్రం మైనార్టీ పట్టణ అధ్యక్షులు రషీద్ ఖాన్,మండల నాయకులు, సర్పంచులు, ఎన్నికల అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇల్లందులో సనాక సమావేశం





- త్వరలో రాష్ట్ర కమిటీ, జాతీయ కమిటీ నిర్మాణం చేయడం జరుగుతుంది

**ఇల్లందు ప్రతినిధి23,( తరంగాలు ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణ పెన్షనర్ భవన్ లో తుడుందెబ్బ సనాత సమావేశం జరిగింది. ఇరు వర్గాలు అయిన కల్తీ సత్యనారాయణ, గోగ్గెల రామస్వామి, వాగబోయిన రవి,ఈసం నరసింహారావు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,రాబోయే రోజుల్లో కలిసి రాష్ట్ర కమిటీ, జాతీయ కమిటీని నిర్మించుకొని ఆదివాసుల కు ఉన్నటువంటి సమస్యల పైన మనకు ఉంన్న చట్టాలు హక్కులను సాధించేవరకు పోరాడుదాం అని తెలిపారు. ముఖ్యంగా పోడు భూముల సమస్యలను పరిష్కరించే దిశగా పోరాటం చేద్దామని అన్నారు. అలాగే మామిడి గుండాల సీలింగ్ భూములపై ఆదివాసులకు పట్టాలిచ్చి హద్దులు చూపిం చలేదని అందరికీ పట్టాలు ఇవ్వలేదని అట్టి భూములపై భూ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. అశ్వాపురం మండలంలో మణిబోతుల గూడెం గ్రామంలో ఫారెస్ట్ అధికారులు ఆదివాసి మహిళలపై దాడిని తీవ్రంగా కండిస్తూ,ఆ మహిళలకు పోడు భూముల పట్టాలు ఇచ్చేవరకు అండగా ఉండి పోరాడుతామని అన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితాల నుండి తొలగించే వరకు పోరాటం ఆపేది లేదని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఫిఫ్త్ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతం లో 1/70 తొలగించాలని గిరిజనేతలు1672 మంది సుప్రీంకోర్టును ఆశ్రయించటం జరిగిందని,దానికి వ్యతిరేకంగా ఆదివాసులు మినిమం ఐదు వేల మంది సుప్రీంకో ర్టును ఇంక్లూడ్ పిటిషన్ వేయాలని వారు పేర్కొన్నారు. జీవో నెంబర్ 3 ని పునర్నిర్మాణ చేసి చట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. 2006 ఫారెస్ట్ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వా న్ని హెచ్చరించారు. పేసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఏజెన్సీలో ఓన్లీ బ్రాందీ షాపులకే తూతూ మంత్రంగా పేసా చట్టం అమలు చేస్తున్నట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఓ ఆదివాసీనని మరిచి గిరిజనేతరలకు సపోర్ట్ చేస్తూ ఆదివాసి చట్టాలు తెలియక మాట్లాడటం సిగ్గుచేటు అంటూ ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమం లో కల్తీ సత్యనారాయణ,గోగ్గె ల రామస్వామి, ఆగబోయిన రవి, ఈసం నరసింహారావు, జారా కృష్ణ, రాంబాబు పొడుగు, సనప కృష్ణమూర్తి, కల్తీ మల్లయ్య, బిజ్జ నరసయ్య, ఈసం రామకృష్ణ, చీమల రమేష్, గోగ్గెల ఆదిలక్ష్మి, పూనెం అనసూర్య, తదితరులు పాల్గొన్నారు.

# వల్లపు రేవతి చిత్రపటానికి నివాళులర్పించిన డాక్టర్ అల్లం -రమ నాగేశ్వర్ రావు



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,జులై.23,తరంగాలు:** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన వల్లపు మహేష్ భార్య వల్లపు రేవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని గురువారం కేసముద్రం నిర్వహించిన ఆమె దిశ దిన కర్మ కార్యక్రమానికి కేసముద్రం మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవతి చిత్రపటానికి పుష్పగుచ్చం సమర్పించి, పూలమాలలు ఏసీ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి బాధాకరమైన సమయంలో అధైర్యపడకూడదని, అండగా ఉండమని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు డాక్టర్ అల్లం రమా -నాగేశ్వర్ రావు, తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానికులు గ్రామస్తులు త దితరులు పాల్గొన్నారు.

## పలు టీవీవీపీ ఆసుపత్రులకు కొత్త మెడికల్ సూపరింటెండెంట్లు

• **సీనియారిటీ ప్రాతిపదికన ముగ్గురు రెగ్యులర్ వైద్యుల నియామకం -- జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ జూలై 24**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని ఆసుపత్రుల్లో పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి జిల్లా కలెక్టర్ శ్రీ అంకిత్ ఐఏఎస్ సీనియారిటీ ప్రాతిపదికన ముగ్గురు రెగ్యులర్ వైద్యులను మెడికల్ సూపరింటెండెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఇటీవల నిర్వహించిన వైద్యుల రీ-డిప్లాయ్‌మెంట్ ప్రక్రియలో పలువురు రెగ్యులర్ వైద్యులు పాల్వంచ, ఇల్లందు, బూర్గంపాడు ఆసుపత్రులకు నియమితులయ్యారు. దీంతో ఆయా ఆసుపత్రుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సీనియర్ రెగ్యులర్ వైద్యులను సీనియారిటీ ప్రాతిపదికన మెడికల్ సూపరింటెండెంట్లుగా నియమించారు. నియమితులైన వైద్యులు: డా. ఎం. ముక్కంటేశ్వరరావు, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (పీడియాట్రిక్స్) --,కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ,పాల్వంచ డా. కె. చంద్రశేఖర్, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (ఆర్థోపెడిక్స్) -- ఏరియా ఆసుపత్రి యెల్లందు డా. జి. ప్రసాద్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (అనస్థీషియా) -- కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బూర్గంపాడుఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్‌ఎస్) డా. జి. రవి బాబు మాట్లాడుతూ, “అనుభవజ్ఞులైన రెగ్యులర్ వైద్యులకు పరిపాలనా బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆసుపత్రుల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత మెరుగ్గా అందుతాయి. ప్రజాకేంద్రిత వైద్య సేవలే మా ప్రధాన లక్ష్యం” అని తెలిపారు.నూతనంగా నియమితులైన మెడికల్ సూపరింటెండెంట్లకు అభినందనలు తెలియజేస్తూ, ఆయా ఆసుపత్రుల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర ఉద్యోగులు పూర్తి సహకారం అందించి ఆసుపత్రుల అభివృద్ధికి తోడ్పడాలని డా. రవి బాబు కోరారు.

## రామవరం మాతా-శిశు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తరంగాలు న్యూస్ జూలై 23:**

రామవరం మాతా-శిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఓపీ, ప్రసూతి వార్డులు, లేబర్ రూమ్, శిశు వార్డు, ఔషధ నిల్వ గది తదితర విభాగాలను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. అలాగే ఆసుపత్రిలో పరిశుభ్రత, సిబ్బంది హాజరు, రోగుల రికార్డులను పరిశీలించి, ప్రతి రోగికి ఎలాంటి ఆలస్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా సమర్థవంతమైన సేవలు అందించాలని కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు.

## టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారం 2025కు దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తరంగాలు న్యూస్ జూలై 23:**

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారం (౧చీచీూాా)--2025 కోసం అర్హులైన భారతీయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఎం. పరంధామరెడ్డి తెలిపారు.భూమి, జల/సముద్ర, వాయు సాహస క్రీడలు, జీవితకాల సాహస సేవల విభాగాల్లో ఈ పురస్కారాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన వారికి ప్రశంసాపత్రంతో పాటు ట్రోఫీ, బ్లేజర్, టై మరియు రూ.15 లక్షల నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.2023, 2024, 2025 సంవత్సరాల్లో సాహస క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారు జూలై 21 నుంచి ఆగస్టు 20, 2026 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయం, ఐడీఓసీ (×ఋాజ), భద్రాద్రి కొత్తగూడెంను సంప్రదించాలని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఎం. పరంధామరెడ్డి కోరారు.

## బోరు బావుల కింద వరి సాగు వద్దు: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

•ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచన



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తరంగాలు న్యూస్ జూలై 23:**

ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు బోరు బావుల కింద వరి సాగుకు దూరంగా ఉండి, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సూచించారు. గురువారం చెంద్రుగొండ మండలం గణుగపాడు గ్రామంలో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు, కూరగాయలు, మొక్కజొన్న, జొన్న వంటి పంటల సాగుపై అవగాహన కల్పించారు. శాస్త్రీయ సాగు పద్ధతులు పాటిస్తూ నీటిని పొదుపుగా వినియోగించాలని రైతులకు సూచించారు.

# ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తా







• పిఆర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్

**నల్లగొండ- జిల్లా 23, తరంగాలు :**

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పి ఆర్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు సరిపడా ఉపాధ్యాయులు లేకున్నా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం గణనీయంగా విద్యార్థుల సంఖ్యను పెంచామని చెప్పారు.నేడు తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలు కుప్పలుగా పేరుకుపోయాయని ఎన్నో ఏళ్లుగా పోరాటాల ఫలితంగా ఇటీవలే హెల్త్ కార్డు సాధించుకున్నప్పటికీ స్పష్టమైన విధి విధానాలు లేక ఉపాధ్యాయులు అయోమయంలో ఉన్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తూ అనునిత్యం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటున్న గౌరవ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కి రాష్ట్ర సంఘానికి ధన్యవాదాలు తెలియజేస్తూ రాబోయే రోజుల్లో 51% ఫిట్మెంతో కూడిన పిఆర్సి,సర్వీస్ రూల్స్,2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్,సిపిఎస్ రద్దు, మహిళా ఉపాధ్యాయుల కోసం ఎలాంటి ఆర్థిక భారం లేని 180 రోజుల చైల్డ్ కేర్ లీవును సర్వీసు మొత్తంలో వాడుకునే విధంగా జీవో తీసుకొని రావడం కోసం ప్రభుత్వంపై గౌరవ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పిఆర్టియు సంఘం రాజీలేని పోరాటం చేస్తుందని, అందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తిప్పర్తి మండల శాఖ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఎంతో సమర్థవంతమైన నాయకుడని గతంలో తాను తిప్పర్తి మండలంలో పనిచేస్తున్న కాలంలో మండల శాఖ అధ్యక్షునిగా మహేందర్ రెడ్డిని నియమించగా తన నిబద్ధత గల పనితీరుతో వరుసగా ఐదు పర్యాయాలు అధ్యక్షునిగా కొనసాగడం అభినందనీయమన్నారు. పోరాటాలకు ఊపిరి పోసిన నల్లగొండ జిల్లా ఏ ఉద్యమమైన ఇక్కడి నుంచే మొదలు కావాలని, అందుకోసం నేను ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారం, సేవాపరమైన అంశాలు కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు,ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు, ఉపాధ్యాయుల కొరత పరిష్కారం కోసం పిఆర్టియు రాష్ట్ర సంఘం ముందుండి పోరాడుతుందని తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం ఉపాధ్యాయుల ఐక్యతకు సంఘ బలోపేతానికి ఒక మంచి వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాబోయే రెండు సంవత్సరాల కాలానికి నిర్వహించిన మండల శాఖ ఎన్నికలో మరోసారి మండల శాఖ అధ్యక్షునిగా నామిరెడ్డి మహేందర్రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా గుర్రం రవి, అసోసియేట్ అధ్యక్షునిగా దండంపల్లి లక్ష్మీనారాయణ, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా వై సునీత, ఉపాధ్యక్షునిగా కంచర్ల తిరుమల్ రెడ్డి,జి నాగరాజు, కార్యదర్శులుగా జానీ పాషా సిహెచ్ శ్రీనివాస్,మహిళా ఉపాధ్యక్షురాలుగా బి ఝాన్సీ రాణి, కే సంధ్య, మహిళా కార్యదర్శిలుగా కే కవిత,కే సుచరిత, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ఆధ్వర్యంలో సుంకరి భిక్షం గౌడ్ గారు ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయుల కోసం పోరాటాలు చేశారని, వారు త్వరలో పదవీ విరమణ పొందిన అనంతరం రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిఆర్టియు సంఘ అభ్యర్థిగా ప్రకటించాలని తీర్మానం చేశారు.బిక్షం గౌడ్ గెలుపు కోసం ప్రతి ఉపాధ్యాయుడు తన వంతుగా సహకారం అందించి గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాలం నారాయణరెడ్డి, మేకల జానారెడ్డి,రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు ఫణి కుమార్, పత్రిక సంపాదకులు గాద వెంకటరెడ్డి,జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కే కిరణ్ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కేశబోయిన గోపాల్, చింతల విజయ్ కుమార్ రెడ్డి, నాగభూషణాచారి,కే శేషయ్య, మండల విద్యాధికారి నరసింహ నాయక్, ప్రధానోపాధ్యాయులు ఎన్ జయరాములు, అయిటిపాముల యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి,రాజరాజేశ్వరి, మోడల్ స్కూల్ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీష్, ఉపాధ్యాయులు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు

# యువతలో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాల పెంపొందింపే ఎన్‌సీసీ లక్ష్యం: జిల్లా కలెక్టర్ అంకిత్

•25 ఎన్‌సీసీ యూనిట్లకు రూ.9 లక్షల శిక్షణ సామగ్రి పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తరంగాలు న్యూస్ జూలై 23:**

యువతను క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో సీఎస్ఆర్ నిధుల ద్వారా జుం౦ఎఅవత్‌ఋ ాౌంజఋఅఎవఙ ాఎఅవఅఎవం ాతీఅజఝ్వ ాఅఎత్వఙ సంస్థ జిల్లాలోని 25 ఎన్‌సీసీ యూనిట్లకు రూ.9 లక్షల విలువైన శిక్షణ సామగ్రిని కలెక్టర్ పంపిణీ చేశారు.






ఈ సందర్భంగా 190 డమ్మీ గన్స్, 130 కంపాస్‌లు, 130 సర్వీస్ ప్రొట్రాక్టర్లు, 190 ఎన్‌సీసీ హ్యాండ్‌బుక్స్, 100 పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. కార్పొరేట్ సంస్థల సహకారంతో ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి పరంధామరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు, ఏఎన్‌ఓలు, క్యాడెట్లు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో "డయల్ డీఎమ్ " కార్యక్రమం



**మిర్యాలగూడ, జులై 23,తరంగాలు** : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ ) మిర్యాలగూడ డిపో ఆధ్వర్యంలో ప్రయాణికుల సమస్యలను తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో "డయల్ యువర్ డిపో మేనేజర్ " కార్యక్రమాన్ని 24.07.2026 సాయంత్రం 4:00 గంటల నుంచి 5:00 గంటల వరకు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ రామ్ మోహన్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రయాణికులు బస్సుల సమయాలు, రూట్లు, సౌకర్యాలు, సేవలకు సంబంధించిన సూచనలు, ఫిర్యాదులు మరియు ఇతర సమస్యలను నేరుగా డిపో మేనేజర్ 9959226308 మొబైల్ నెంబర్ కు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేసి ఆర్టీసీ సేవల మెరుగుదలకు సహకరించాలని డిపో మేనేజర్

# పరకాల డెయిరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**హనుమకొండ ప్రతినిధి, జులై 23,తరంగాలు :** పరకాల ఇందిరా మహిళా డెయిరీని త్వరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని, అందుకు అవసరమైన వనరులను అందించడంలో అధికారులు సహకరించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, డీఆర్డీవో మేన శ్రీను, ఇతర అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల మహిళా డెయిరీకి పాలను అందించేందుకు కొత్తగా పాడి రైతులు నమోదై ఉన్నారని తెలియజేశారు. నమోదైన మహిళా పాడి రైతులకు గేదెలను వివిధ సంక్షేమ శాఖల ద్వారా రాయితీపై అందించే అంశాన్ని పరిశీలించాలని కలెక్టర్ కు సూచించారు. డెయిరీకి కావాల్సిన వనరుల గురించిన వివరాల నివేదికను డెయిరీ అధికారులు కలెక్టర్ కు అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరకాల ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మహిళా డెయిరీ ద్వారా పాలు, పాల ఉత్పత్తులు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో మేన శ్రీను, అడిషనల్ డీఆర్డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం సరిత, పరకాల మహిళా డెయిరీ ఛైర్ పర్సన్ అరుణ, జనరల్ మేనేజర్ జె.కృష్ణ, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ సృజన్ కుమార్, టెక్నికల్ మేనేజర్ ఆర్యా అక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతికతతో భూముల రీసర్వే పనులు వేగవంతం చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్ ప్రతినిధి , జూలై 23, తరంగాలు :** భూముల రీసర్వే పనులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించిన భూముల రీసర్వే అవగాహన సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్, రీసర్వే విధి-విధానాలు, పనుల పురోగతి, లైసెన్స్ సర్వేయర్ల బాధ్యతలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.లైసెన్స్ సర్వేయర్లకు కేటాయించిన గ్రామాల్లో సర్వే పనులు పూర్తయ్యే వరకు పూర్తి బాధ్యతతో వ్యవహరించి, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.సర్వే ప్రక్రియలో కంటిన్యూయస్ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్స్ , క్వాంటమ్ జియోగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటి ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని, సర్వేయర్లు ఈ సాంకేతికతపై శిక్షణ పొంది తమ నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.భూ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా



ఖచ్చితమైన రికార్డులు రూపొందించాలని, రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి రీసర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. సంధ్యారాణి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సంచాలకులు ఎం. శ్రీనివాసులు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఏ. రాజేంద్ర చారి, శాఖ అధికారులు, సిబ్బంది, లైసెన్స్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి అండగా ఉంటా





- వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు

**వర్ధన్నపేట ప్రతినిధి, జులై 23,తరంగాలు** : మృతురాలి కుటుంబానికి అండగా ఉంటానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు అన్నారు.వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి చెందిన బెల్లం బిరమ్మ గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు వారి నివాసానికి వెళ్లి మృతురాలు భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.బాధిత కుటుంబానికి ఏ కష్టం వచ్చినా తామందరం అండగా నిలబడుతామని అన్నారు.నియోజకవర్గంలో మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ ,వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య,పి ఏ సి ఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా,కట్రియాల ఉప సర్పంచ్ నాంపెల్లి రవీందర్,కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారి సతీష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండీ అక్బర్,వార్డు మెంబర్ చెవ్వల్ల సమత,వార్డు మెంబర్ ఇటికాల శ్రీలతరాజు,కట్రియాల మాజీ టెంపుల్ చైర్మన్ కట్ట వెంకటయ్య,ఎస్సీ సెల్ జిల్లా నాయకులు మరుపట్ల సాయికుమార్ ,మల్లెపాక సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు దొమ్మటి రాము,కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్ర సురేందర్,చెవ్వల్ల రమేశ్,చెవ్వల్ల నారాయణ,కామిండ్ల రాజు కుమార్,గోరుకొంటి అయ్యాలు,కామిండ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత





- వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి

**వర్ధన్నపేట ప్రతినిధి , జూలై 24, తరంగాలు** : వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అన్నారు.వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో "క్యాచ్ ది రేయిన్ -- వర్షమే జీవనధారం, నీరే జీవనాధారం... ఒడిసి పట్టండి, జీవితానికి భరోసా ఇవ్వండి" అనే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు కలిసి వర్షపు నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు నీటి కొరత రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇల్లు, ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ప్రతి విద్యాసంస్థలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే నీటి విలువను తెలుసుకొని నీటిని వృథా చేయకుండా వినియోగించాలని, తమ కుటుంబ సభ్యులకు కూడా వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. నీటిని ఆదా చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. అనంతరం అందరూ కలిసి "వర్షపు నీటిని ఒడిసి పట్టుదాం -- నీటి వనరులను కాపాడుదాం -- భవిష్యత్ తరాలకు భరోసా కల్పిద్దాం" అనే ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ కమ్మం కృష్ణ, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి

- పర్వతగిరి ఎంపీడీవో శంకర్ నాయక్
- పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి
- అనంతారం సర్పంచ్ తౌటి శ్రీలత
- మహిళలు ఆస్తుల కల్పనకు కృషి చేయాలి
- సెర్ప్-డిఆర్డిఎ ఎ పి యం రాజీరు





**పర్వతగిరి, జులై 23, తరంగాలు** : ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల వలన ప్రతి ఒక్కరూ ఇంటింటికి ఇంకుడు గుంతలు, పంట పొలాల వద్ద (ఫాంఫండ్) పంట గుంటలను నిర్మించుకొని నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పర్వతగిరి ఎంపీడీవో శంకర్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని అనంతారం గ్రామంలో సరస్వతి గ్రామైక్య సంఘం 20 వార్షిక మహాసభ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ తౌటి శ్రీలతతో కలిసి మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఇంటింటికి ఇంకుడు గుంత, పంట పంటకు పంట కుంట, ఊరూరా ఊటకుంట అనే నినాదంతో ప్రభుత్వం జలసిరి కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని అందువలన ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ చర్యలు చేపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చునని సూచించారు. నిర్దేశించిన గడువులో ప్రతి ఒక్కరు జలసిరి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయుట కృషి చేయాలని కోరారు. సర్పంచ్ తౌటి శ్రీలత మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె మహిళలను కోరారు. సెర్ప్-డిఆర్డిఏ ఏపీఎం రాజీర్ మాట్లాడుతూ... మహిళలు గ్రామైక్య సంఘం ద్వారా అందించే సేవలను వినియోగించుకొని ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను పెంపొందించుకొని ఆస్తుల కల్పన కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీసీ గోలి కొమురయ్య, పంచాయితీ కార్యదర్శి కవిత, వివో అధ్యక్షురాలు గొర్రె సుకన్య, మాజీ మండల సమైక్య అధ్యక్షురాలు, వార్డు సభ్యులు నాగమణి, సిఆర్పి పంతంగి రజిత, వివో ఏ మేకిరి రాజేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ పేరువారం తిరుపతి, వివో కార్యనిర్వహణ కమిటీ సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టాన్ని తప్పనిసరిగా పాటించాలి





- హనుమకొండ డీఎంహెచ్వో డాక్టర్ ఏ. అప్పయ్య
- రోగులకు అందిస్తున్న వివిధ వైద్య సేవల ఫీజు వివరాలు, కన్సల్టెంట్ వైద్యుల వివరాలను ఆసుపత్రుల్లో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి
- అవసరం లేని వైద్య పరీక్షలు చేయించి రోగులను ఇబ్బందులకు గురిచేయెద్దు
- వైద్యులు తమ విద్యార్హతలకు అనుగుణంగా మాత్రమే వైద్యం అందించాలి
- నిబంధనలను ఉల్లంఘిస్తున్న వైద్య సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటాం

**హనుమకొండ ప్రతినిధి , జూలై 24, తరంగాలు : జిల్లాలోని అన్ని ప్రైవేట్** క్లినిక్లు, ఆసుపత్రులు, దయాగ్నస్టిక్ సెంటర్లు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్వో) డాక్టర్ ఏ. అప్పయ్య స్పష్టం చేశారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలు, అందిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన గురువారం పలు ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న లేదా చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తున్న వైద్య సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగులకు అందిస్తున్న వివిధ వైద్య సేవల ఫీజు వివరాలు, కన్సల్టెంట్ వైద్యుల వివరాలను ఆసుపత్రుల్లో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. అవసరం లేని వైద్య పరీక్షలు చేయించి రోగులను ఇబ్బందులకు గురిచేయవద్దని, మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యులు తమ విద్యార్హతలకు అనుగుణంగా మాత్రమే వైద్యం అందించాలని, అనుమతుల్లో పేర్కొన్న వైద్యులు, టెక్నీషియన్లు, సిబ్బందే విధులు నిర్వహించాలని తెలిపారు. డాక్టర్లలో మార్పులు జరిగితే ముందస్తుగా ఆరోగ్య శాఖకు సమాచారం ఇవ్వాలని, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. డీఎంహెచ్వో ఊరుగొండలోని గాయత్రీ క్లినిక్, ప్రాణ హాస్పిటల్, హనుమకొండలోని అపర్ణ నర్సింగ్ హోమ్, లాస్య హాస్పిటల్లను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. చికిత్స కోసం వచ్చిన రోగులు, వారి బంధువులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డెంగ్యూ నిర్ధారణ కోసం ర్యాపిడ్ టెస్ట్లపై ఆధారపడకుండా ఎలిసా పరీక్ష ద్వారానే నిర్ధారణ చేయాలని సూచించారు. ప్లేట్లెట్స్ తగ్గిన ప్రతి కేసును డెంగ్యూగా భావించి రోగు గురిచేయవద్దని వైద్యుల భయాందోళనలకు చించారు. అలాగే ప్రీ-కన్సెప్షన్ అండ్ ప్రీ-నాటల్ దయాగ్నస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్డిటీ ) చట్టం ప్రకారం స్కానింగ్ పరీక్షలు కేవలం శిశువు ఎదుగుదల, అవయవ లోపాలు, ఇతర వైద్య అవసరాల కోసం మాత్రమే నిర్వహించాలని, లింగ నిర్ధారణకు పాల్పడితే సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డాక్టర్ అప్పయ్య హెచ్చరించారు. ఈ తనిఖీల్లో దామెర వైద్యాధికారి డాక్టర్ మహేందర్, మురళి మనోహర్తో పాటు పర్యవేక్షణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎల్నినో ప్రభావంపై ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద




**వరంగల్ ప్రతినిధి , జూలై 23, తరంగాలు** :ఎల్నినో ప్రభావంతో జిల్లాలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీరు, సాగునీరు, పశుగ్రాసం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్లో తన ఛాంబర్లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలు ఆలస్యమైనా ప్రజలకు కనీస అవసరాలు నిరంతరాయంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామాల్లోని ఓవర్హెడ్ ట్యాంకులు, హ్యాండ్పంపులు, బోరుబావుల పనితీరును పరిశీలించి, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. అవసరమైతే తాగునీటి ట్యాంకర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువుల నిల్వలు కూడా సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఫోడర్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని అంచనా వేసి రోజువారీ నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## బ్లాక్ స్పాట్లపై సీపీ ప్రత్యేక దృష్టి

- రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయ చర్యలు
- జాతీయ రహదారిపై ప్రమాద ప్రాంతాల పరిశీలన
- భద్రతా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశాలు



**హనుమకొండ ప్రతినిధి , జూలై 23, తరంగాలు** : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్లపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం సంబంధిత పోలీసు అధికారులు, జాతీయ రహదారి అథారిటీ, రోడ్డు రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి జాతీయ రహదారి--163పై హనుమకొండ--హైదరాబాద్ ప్రధాన రహదారి మార్గంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే పది మందికిపైగా బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు తరచుగా సంభవించడానికి గల కారణాలను సంబంధిత అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలపై విస్తృతంగా చర్చించి, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తక్షణ చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ప్రజల ప్రాణాల రక్షణకు రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే అనుసంధాన రహదారులు, డివైడర్ ఓపెనింగ్లు ఉన్న ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, దిశా నిర్దేశక సూచికలు, రిఫ్లెక్టివ్ సైన్ బోర్డులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి అధికారులకు ఆదేశించారు. జాతీయ రహదారి వెంట ఉన్న మద్యం దుకాణాల వద్ద వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పార్కింగ్ను క్రమబద్ధీకరించేలా సంబంధిత వ్యాపారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే నివారించేలా అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. పరిశీలన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో మాట్లాడిన పోలీస్ కమిషనర్ వారి సమస్యలను తెలుసుకున్నారు. కరుణాపురం వద్ద పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరగా, అవసరమైన ప్రాంతాల్లో అలాంటి వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రమాద బాధితులను అత్యవసరంగా ఆసుపత్రులకు తరలించేందుకు ఏర్పాటు చేసిన అంబులెన్స్ను పరిశీలించి, అందులోని వైద్య సదుపాయాలు, సిబ్బంది స్పందన తీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ఘనపూర్ ఏసీపీ భీంశర్మతో పాటు జాతీయ రహదారి అథారిటీ, రోడ్డు రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.



# నీట్ పేపర్ లీకేజీపై కేసముద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ధర్నా






- ప్రశ్నించే గొంతులను తాళం వేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఎమ్మెల్యే డా. మురళీ నాయక్లి
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు
- కసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి

**కేసముద్రం ప్రతినిధి, జులై 23,తరంగాలు** :అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేసముద్రం మున్సిపాలిటీ అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నీట్ పేపర్ లీకేజీ ఘటనకు, ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మానుకోట ఎమ్మెల్యే డా. మురళీ నాయక్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని తీవ్రంగా విమర్శించారు. నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో వరుసగా జరుగుతున్న అవకతవకలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని అన్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతులను తాళం వేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల తరఫున నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ వంటి ఘటనలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమైన విద్యార్థుల శ్రమ ఒక్క ఘటనతో వృథా కావడం బాధాకరమని అన్నారు. ఇలాంటి సంఘటనలు విద్యార్థుల్లో పరీక్షలపై నమ్మకాన్ని దెబ్బతీసి, వారి ఉన్నత విద్య లక్ష్యాలను ఆందోళనకరంగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శకత, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా బాధ్యులపై తగిన చర్యలు తీసుకుని,పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు.



# జల నిర్వహణలో వినూత్న సాంకేతికతలకు ప్రాధాన్యం






**•స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, మురుగునీటి శుద్ధి స్టార్టప్‌లపై జిల్లా కలెక్టర్ సమక్షంలో ప్రజెంటేషన్**

**హనుమకొండ ప్రతినిధి , జూలై 23,తరంగాలు** :జల నిర్వహణలో వినూత్న సాంకేతికతలకు జిడబ్లుఎంసి పరిధిలో ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సమక్షంలో జల వనరుల సమర్థ నిర్వహణ, నీటి వృథా నివారణ, మురుగునీటి శుద్ధి, భూగర్భ జలాల పరిరక్షణ లక్ష్యంగా రూపొందించిన రెండు వినూత్న స్టార్టప్‌లపై ప్రత్యేక ప్రజెంటేషన్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డా. శిరీష్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన "హరికేన్ ప్రాసెస్ ఇంటెన్సిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్" స్టార్టప్‌ను వివరించారు. ఈ సాంకేతికత ద్వారా గ్రే వాటర్ (టాయిలెట్ మినహా గృహ వినియోగ మురుగునీరు), బ్లాక్ వాటర్ (టాయిలెట్ మురుగునీరు)ను శుద్ధి చేసి తిరిగి వినియోగించే విధానాన్ని వివరించారు. ఈ స్టార్టప్‌కు భారత ప్రభుత్వం నుంచి గుర్తింపు లభించినట్లు తెలిపారు.

జీడబ్ల్యూఎంసీ, ఎన్ఐటీ వరంగల్, ఆస్కి సంయుక్తంగా త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుని ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాతిపదికన అమలు చేయాలని ప్రతిపాదించారు. హన్మకొండ కలెక్టరేట్ ఐడీఓసీ ప్రాంగణంలోని ఒక బావి పరిసర ప్రాంతాన్ని ఇందుకు ఎంపిక చేసి, భూగర్భంలోకి చేరుతున్న మురుగునీటిని శుద్ధి చేసి ఐడీఓసీలోని ఉద్యానవనాలకు వినియోగించడంతో పాటు భూగర్భ జలాల కాలుష్యాన్ని నివారించవచ్చని వివరించారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ ప్రతినిధి హిరణ్య తల్లం ఐఓటీ (ఇంటర్నెట్ అఫ్ థింగ్స్ ) ఆధారిత స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నగరంలోని ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులు, పంపింగ్ వ్యవస్థలను స్మార్ట్ మీటర్లు, స్మార్ట్ మోటరైజ్డ్ వాల్వ్‌లు, లెవెల్ సెన్సర్లతో అనుసంధానం చేసి రియల్‌టైమ్‌లో పర్యవేక్షించడం ద్వారా నీటి సరఫరాను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. ఈ సాంకేతికతతో నీటి వృథా, లీకేజీలు, విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గడంతో పాటు పంపుల నిర్వహణ మెరుగుపడుతుందని, వినియోగదారులకు నిర్ణీత సమయంలో నాణ్యమైన తాగునీటిని అందించేందుకు ఈ వ్యవస్థదోహదపడుతుందని వివరించారు. ప్రజెంటేషన్‌లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పరిశీలించారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా దశలవారీగా ఈ సాంకేతికతలను ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే వినూత్న ఆవిష్కరణలకు జిల్లా యంత్రాంగం, జీడబ్ల్యూఎంసీ పూర్తి సహకారం అందిస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్. రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేందర్, సంజయ్, డీఈ స్పందన, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డా. శిరీష్, స్టార్టప్ ప్రతినిధి హిరణ్య తల్లం, ఆస్కి కోఆర్డినేటర్ రాజమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకుందాం





**రాష్ట్ర అటవి పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**హన్మకొండ ప్రతినిధి ; జూలై 23, తరంగాలు** :తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ హనుమకొండ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం "బ్రేక్ ఖీతీవవ ఫ్రమ్ డ్రగ్స్ -- బిల్డ్ ఏ బ్రైట్ ఫ్యూచర్ ", "సే నో టు డ్రగ్స్ " నినాదాలతో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కాళోజీ జంక్షన్ వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికిరాష్ట్ర అటవి పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈ ర్యాలీలో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, హనుమకొండ అదనపు కలెక్టర్ రవి, వరంగల్ డీసీపీ ధారా కవిత, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలతో కలిసి "సే నో టు డ్రగ్స్" ప్రతిజ్ఞ చేయించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజ నిర్మాణంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య, డి పి ఆర్ ఓ అయుబ్ అలీ, కుడా మాజీ చైర్మెన్ సుందర్ రాజ్ యాదవ్ తో పాటు జర్నలిస్ట్ యూనియన్ బాధ్యులు ,పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు.




## డాక్టర్ అనితా రెడ్డి కి నెల్సన్ మండేలా పీస్ అవార్డు



**వరంగల్ ప్రతినిధి, జులై 23,తరంగాలు** : గ్లోబల్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ వారు డాక్టర్ అనితా రెడ్డి చేస్తున్న సమాజ సేవను గుర్తించి నెల్సన్ మండేలా పీస్ అవార్డును అందించారు. ఆరోగ్య కరమైన సమాజానికి ,యువత సన్మార్గమార్పు కు డాక్టర్ అనితా రెడ్డి అందిస్తున్న సేవలను గుర్తించి సంస్థ పౌండర్ చైర్మన్ అడ్వకేట్ డాక్టర్ చక్రవర్తి నెల్సన్ మండేలా పీస్ అవార్డు కు ఎంపిక చేసినట్లు తెలిపారు మానవ హక్కుల రక్షణ, లంచాలను అరికట్టడం లో డాక్టర్ అనితా రెడ్డి యువతను తీర్చిదిద్దుతున్న తీరు వినియోగదారుడు మోసపోకుండా ఉండేందుకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు చాలా స్ఫూర్తి గా ఉన్నాయని అవి గ్లోబల్ హ్యూమన్ రైట్స్,యాంటీ కార్పషన్ కన్జుమర్ ప్రొటెక్షన్ సంస్థ కు సమాజానికి చాలా ఉపయోగ పడుతున్నాయని అందుకే ఈ ప్రతిష్టాకరమైన అవార్డు ను డాక్టర్ అనితా రెడ్డి కి ఇవ్వడం జరిగిందని డాక్టర్ చక్రవర్తి అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, బాద్యత మరింత పెరిగిందని మానవ హక్కుల రక్షణ, లంచాలను అరికట్టడం లో భారత దేశం ఇతర దేశాలతో పోలిస్తే చాలా వెనక పడ్డమాట వాస్తవంఅని ,ఎందుకంటే ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహిస్తే ఈరోజు మనం ముందు వరసలో ఉండేవారం. ముఖ్యంగా వెనక పడ్డటానికి కారణం మానవ హక్కులకు రక్షణ లేక పోవడం, విపరీతంగా లంచాలు తీసుకోవడం పెరగడం, వినియోగ దారుడు మోస పోవడం ఇవి ముఖ్య కారణాలు అందుకే వీటిపై ఎక్కువ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి విలువలతో కూడిన యువతను తయారు చేయడంలో కీలకమైన పాత్ర పోషించి మా వంతు సమాజాసేవ బాధ్యతగా చేస్తానని అన్నారు, అవార్డులు రావడం గొప్ప కాదని ఆ అవార్డు కు వన్నె తెచ్చేలా పనిచేయ గలగాలని నమ్మే వ్యక్తిని నేను మాటలు చెప్పి కాదు పనిచేసి చూపిస్తానని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు

## దమ్ముంటే నీట్‌పై చర్చకు రావాలి

**విపక్షాలకు బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్**



న్యూఢిల్లీ,జులై 23 దేశంలో ప్రకంపనలు పుట్టిస్తోన్న నీట్ పరీక్ష వ్యవహారం, పేపర్ లీక్‌ల అంశంపై పార్లమెంట్ వేదికగా ఓపెన్ డిబేట్‌కు సిద్ధమా అని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విపక్షాలకు సవాల్ విసిరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు విపక్ష కూటమి పార్లమెంట్‌లో చర్చకు రాకుండా పారిపోతోందని, సభ ముందుకు వస్తే వారి 'ద్వంద్వ నీతి' బయట పడుతుందనే భయంతోనే వెనకడుగు వేస్తున్నారని నితిన్ నబిన్ ఆరోపించారు. పేపర్ లీక్ దోషులకు కఠిన శిక్షలు ఖరారు చేసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టులు' ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన అనంతరం రాహుల్ గాంధీ తీవ్ర విమర్శల నేపథ్యంలో బీజేపీ అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన నితిన్ నబిన్ ప్రతిపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించి ప్రతి అంశంపైనా లోక్‌సభలో చర్చించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉంది. ఔఇఇఉ సహా ఏ అంశంపైనైనా చర్చకు మేము సిద్ధం, మీరు సిద్ధమా? పార్లమెంట్ వేదికగా చర్చకు రావాలని రాహుల్ గాంధీకి సవాల్ విసురుతున్నాం' అని ఆయన అన్నారు. 'రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానం అంతా పారిపోవడమే. దాదాపు 50-60 ఏళ్లుగా యువతను వంచించడం, రెచ్చగొట్టడం, దారి మళ్లించడమే కాంగ్రెస్ చరిత్ర. అందుకే సభలో చర్చకు వస్తే తమ రంగు బయటపడుతుందని భయపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. విపక్షాలు యువతను కేవలం నిరసనకారులుగా, 'రాళ్లు విసిరేవారిగా' మాత్రమే చూశాయని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం యువతకు సురక్షితమైన, ప్రకాశవంతమైన భవిష్యత్తును అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## నీట్‌పై విద్యార్థుల ఆక్రందన సబబే

- దానికి సానుకూలంగా స్పందించాల్సిందే
- ప్రభుత్వ విధానాలను తూర్పారా బట్టిన కమల్ హాసన్



న్యూఢిల్లీ,జులై 23 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలకు ప్రముఖ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల ఆందోళనలపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. 'ఒక బిడ్డ ఏడ్చినప్పుడే మనం వినాల్సింది. కానీ ఎంతోమంది పిల్లలు ప్రాణాలు కోల్పోయే వరకు వేచి చూశాం. నేర్చుకోవడం స్థానంలో శిక్షణ, జిజ్ఞాస స్థానంలో ఆందోళన, ప్రతిభ స్థానంలో నేర ప్రవృత్తి చోటుచేసుకుంది. ఇది కుళ్లిపోయిన వ్యవస్థ' అని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు సమాధానాలు, అవకాశాలు అందించాల్సిన వ్యవస్థ వారిని అడ్డంకులు, ఒత్తిళ్లు, నిరాశల వైపు నెట్టివేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'పిల్లలకు సమాధానాల బదులుగా అడ్డంకులు, లాఠీలు ఎదురైతే అది ఒక దేశ వైఫల్యానికి సంకేతం' అని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త, విద్యా సంస్కరణల కోసం పోరాడుతున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను ఉద్దేశించి కమల్ హాసన్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. 'దేశానికి రాబోయే ప్రయాణంలో మీ అవసరం ఉంది. దయచేసి మీ నిరాహార దీక్షను విరమించండి' అంటూ కోరారు.

అదేవిధంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన భావోద్వేగ సందేశం ఇచ్చారు. 'భారతదేశ బిడ్డలారా.. మీరే మాలో ఉత్తములు. మీరు మీ కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఇప్పుడు దేశం మీకు తన కర్తవ్యాన్ని నెరవేర్చాల్సిన సమయం వచ్చింది. మీ కలలు ఎల్లప్పుడూ మా వైఫల్యాల కన్నా ఉన్నతంగా నిలవాలి' అని పేర్కొన్నారు.

జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న నీట్ వ్యతిరేక నిరసనలకు రాజకీయ, సామాజిక వర్గాల నుంచి మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు, విద్యావిధానం, ప్రవేశ పరీక్షలపై జాతీయ స్థాయిలో చర్చ మళ్లీ వేడెక్కుతోంది.

## కోచింగ్ సెంటర్లకు దాసోహంగా మారిన నీట్

- వెంటనే రద్దు చేసి, రాష్ట్రాలకే బాధ్యతలు ఇవ్వాలి
- విద్యార్థుల ఆందోళనకు మద్దతు పలికిన మాజీ సిఎం స్టాలిన్

చెన్నై,జులై 23 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. నీట్ పరీక్షను నిలిపివేయడమే విద్యార్థుల సమస్యలకు ఏకైక పరిష్కారమని పేర్కొన్నారు. 'రాష్ట్రాలను నమ్మండి.. నీట్‌ను రద్దు చేయండి' అని డిమాండ్ చేశారు. నీట్ ప్రవేశపెట్టిన మూడు ప్రధాన లక్ష్యాల్లోనూ ఈ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని స్టాలిన్ ఆరోపించారు. విద్యలో సమాన అవకాశాలు కల్పించడం, పారదర్శకత పెంచడం, నాణ్యమైన విద్యను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలు సాధించడంలో నీట్ విఫలమైందని విమర్శించారు. పాఠశాల విద్యా వ్యవస్థను బలహీనపరిచి, కోచింగ్ సెంటర్ల ఆధిపత్యాన్ని పెంచే పరిస్థితిని నీట్ తీసుకువచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆవేదన, ఆందోళనలు కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలని స్టాలిన్ వ్యాఖ్యానించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తన వైఖరిని పున:సమీక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు. సామాజిక న్యాయాన్ని పరిరక్షించాలంటే నీట్ రద్దు అత్యవసరమని స్పష్టం చేశారు. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నీట్ అన్యాయం చేస్తోందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్టాలిన్ స్పష్టం చేశారు.

# కేజీబీవీ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి





## హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**హనుమకొండ ప్రతినిధి, జూలై 23, తరంగాలు** :కేజీబీవీ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర రోడ్డులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాల (కిచెన్), తాగునీటి సౌకర్యాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై అధికారులను ఆరా తీశారు. అనంతరం విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న విద్య, వసతి, ఆహారం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, విద్యార్థినుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ రాజేష్, ఎంఈవో సునీతారాణి, ఎంపీడీవో వీరేశం, కేజీబీవీ ప్రత్యేకాధికారి జ్యోతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కుల వివక్ష హత్య బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు





**వర్ధన్నపేట ప్రతినిధి, జులై 23,తరంగాలు: హైదరాబాద్లోని** మాదాపూర్లో కుల వివక్ష నేపథ్యంలో హత్యకు గురైన చిన్నపెల్లి భాస్కర్ కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల నాయకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చిన నాయకులు వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని తమ వంతు సహాయంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల నాయకులు కంచర్ల రవికుమార్, మరుపట్ల దేవదాస్, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్చార్జి బొక్కల నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్కూరి రమేష్, అయినవోలు మండల ఇన్చార్జి బరిగల ఏలీయా అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మాదాపూర్ లో ఇటీవల చిన్నపెల్లి భాస్కర్ హత్య అత్యంత దారుణమైందని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నిందితులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం సహా కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇందిరమ్మ ఇల్లు, అలాగే కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. బాధిత కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి కుల వివక్ష ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, సామాజిక న్యాయం కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం కొనసాగుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలగం ఎల్లకుమార్, యాతర అనిల్, బర్ల యాదగిరి, బర్ల కొమురయ్య, మహమ్మద్ యాకూబ్, ఎంఎస్పీ మండల అధ్యకుడు ఇపం బాబు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీ మేడి ఉపేందర్ మనవరాళ్ల పుష్పాలంకరణలో పాల్గొన్న చిలువేరు సమ్మయ్య గౌడ్





**కేసముద్రం ప్రతినిధి, జులై 23,తరంగాలు** : కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మేడి ఉపేందర్ మనవరాళ్లు శ్రీనిధి, నిత్యశ్రీల పుష్పాలంకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. మేడి అంజలి--మేడి యాకంభ్రం దంపతుల ఆహ్వానం మేరకు జిల్లా కాంగ్రెస్ నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ, చిన్నారులు విద్యలో, సంస్కారంలో, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం మేడి కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పుష్పాలంకరణ వంటి సాంప్రదాయ కార్యక్రమాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఇటువంటి వేడుకలను ప్రతి కుటుంబం కొనసాగించాలని సూచించారు. చిన్నారులు మంచి విద్యతో పాటు మంచి విలువలు అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలాజీ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగేల్లి శ్రీనివాస్, శ్రీరామ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మేడి ఉపేందర్, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, ఆహ్వానితులు పాల్గొని చిన్నారులకు ఆశీస్సులు అందజేశారు.

## వరంగల్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగ అభివృద్ధి, ఉపాధి అవకాశాలపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఎంపీ డా. కడియం కావ్య



**న్యూఢిల్లీ, జులై 23,తరంగాలు** : వరంగల్ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగ అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లాలో కేంద్ర పథకాల అమలు, వాటి ద్వారా సాధించిన పురోగతిపై వివరాలు కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత మూడు సంవత్సరాల్లో ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద వరంగల్ జిల్లాలో 147 ప్రాజెక్టులు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 171 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, వీటి ద్వారా రూ.18.91 కోట్ల పెట్టుబడులు సమకూరగా, రూ.4.15 కోట్ల సబ్సిడీ మంజూరై 549 మందికి ఉపాధి లభించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, వ్యవసాయాధారిత జిల్లాగా ఉన్న వరంగల్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగ విస్తరణ రైతులు, యువతకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. పంట అనంతర నష్టాలను తగ్గించడం, వ్యవసాయ ఉత్పత్తులకు విలువను పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం కోసం కేంద్ర పథకాలను మరింత సమర్థంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో మరిన్ని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, నిల్వ కేంద్రాలు, విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ కోరారు. రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు సృష్టించేలా చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

## నీట్ అంశంపై కాంగ్రెస్ ధర్నా

- సోనియా, ప్రియాంక గాంధీలతో కలిసి ధర్నాలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**న్యూఢిల్లీ, జులై 23,తరంగాలు** : నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన ధర్నాలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో కలిసి ఎంపీ ఆందోళన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, నీట్ పరీక్ష వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వారి గళాన్ని వినాల్సిన ప్రభుత్వం, వారిపైనే బలప్రయోగానికి దిగడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని, దీనిపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం చర్చకు ముందుకు రాకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల ఆందోళనలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ తన మౌనం వీడి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, భవిష్యత్తు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు.

# విశ్వనాథం అండ్ సన్స్ నుంచి కొత్త లుక్ విడుదల

కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ అభిమాన వర్గం ఉంది. ఇటీవల విడుదలైన 'వీరభద్రుడు' సినిమాతో మాస్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన కొత్త పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా బ్రౌన్ కలర్ సూట్‌లో సూర్య కనిపించిన స్టైలిష్ లుక్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చాలా కాలం తర్వాత సూర్యను ఇలాంటి క్లాస్, వింటేజ్ స్టైల్‌లో చూడటం ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ పోస్టర్లతో సినిమాపై మరింత హైప్ పెంచిన మేకర్స్ మరో సర్‌ప్రైజ్ కూడా ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో, ఈ కొత్త పాటపై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలను కలగలిపిన కథతో తెరకెక్కుతున్నట్లు
తెలుస్తోంది. సూర్యను కొత్త కోణంలో చూపించే ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సూర్య బర్త్‌డే పోస్టర్లు ట్రెండింగ్‌లో ఉండగా, సాయంత్రం విడుదల కానున్న రెండో సాంగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.